క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు బాండ్ పత్రం ఇస్తున్న దుర్గాప్రసాద్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన వంటిపల్లి శ్రీరామ పార్వతి వరప్రసాద్ మంగళవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆయన కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దాత కుటుంబానికి ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఏజెన్సీలో భారీ వర్షం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో అంధకారం నెలకొంది.

సమస్యలు పరిష్కరించాలి

చింతలపూడి: గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడిలో మంగళవారం గ్రామాభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ



రైతులు పనిముట్లు అందిస్తున్న ఏఓ

పోలవరం రూరల్: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు పవర్ టిల్లర్లు, పవర్ స్ప్రేయర్లు రాయితీపై అందజేసినట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు తెలిపారు. మండలంలో 2 పవర్ టిల్లర్లు (రూ.1 లక్ష రాయితీతో), నాలుగు పవర్ స్ప్రేయర్లు (50 శాతం రాయితీతో) రైతులకు అందించామన్నారు. కార్యక్రమంలో గుణపర్తి చిన్ని, బొడ్డు కృష్ణ, వీరపశెట్టి వెంకటరత్నం, నులకాని రాంబాబు, నాగిరెడ్డి నాగేశ్వరరావు, బొలుసు రాంబాబు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి బహూకరణ



హెచ్ఎంలను సత్కరిస్తున్న దాత సురేష్

ద్వారకాతిరుమల: మండలంలోని పి.కన్నాపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఐదు ప్రభుత్వ పాఠశాలలకు అదే గ్రామానికి చెందిన తణుకు వెంకట పెద్ది సురేష్ రూ.80 వేలు విలువైన క్రీడా సామగ్రిని మంగళవారం బహూకరించారు. పి.కన్నాపురంలో ఎంపీపీ, ఎంపీయూపీ పాఠశాలలకు, దాడవల్లి, శరభాపురం, చిన్న ఎగ్గేపురం గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలలకు ఈ సామగ్రిని అందించారు. దాత ప్రధానోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఎస్ఎంసీ చైర్మన్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రవి

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం వితంతువులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, మండల కార్యదర్శి తెల్లం దుర్గారావులు మాట్లాడుతూ సీపీఎం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ చంద్రాల శ్రీరాములు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, చిట్టిబొమ్మ కొండలరావు, కారం నాగదుర్గ, గుడెల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

పోషకాహార లోపంతోనే అనారోగ్యం

జంగారెడ్డిగూడెం: పోషకాహార లోపంతోనే అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ఐసీడీఎస్ సీడీపీఓ పి.బ్యూల అన్నారు. మండలంలోని జొన్నవారిగూడెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో గృహ సందర్శన చేసి లబ్ధిదారుల నూతన రిజిస్ట్రేషన్, గర్భిణుల ముందస్తు నమోదు, ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలు, ప్రతి నెలా టీహెచ్ఆర్ తీసుకోవడం, ప్రసవం నాటికి అనారోగ్యానికి లేదా రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రానికి రేకుల షెడ్ నిర్మించిన దాతలను సత్కరించారు. సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం, ఎంఎల్‌హెచ్ఓ తేజస్విని, పీహెచ్ఎన్ విజయకుమారి, ఏఎన్ఎం కళావతి పాల్గొన్నారు.

విద్యార్థులకు వసతి కష్టాలు

- శిథిలావస్థలో గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం
- బిక్కుబిక్కుమంటూ ఉంటున్న విద్యార్థులు
- కొత్త భవనం నిర్మించాలని విద్యార్థి సంఘాల డిమాండ్



బుట్టాయగూడెం గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం



బుట్టాయగూడెంలో బాలుర వసతిగృహంలో ఇలా..

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఈ వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని శ్లాబ్ పెచ్చులు ఊడి వర్షపునీరు భవనం లోపలికి ప్రవేశిస్తున్నాయి. బీటలు వారిన గోడలు, సరైన సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. శిథిలమైన ఈ భవనంలో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం చోటుచేసుకుంటుందో అని విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సుమారు 52 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలో కేఆర్‌పురం ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంగా ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. ఈ వసతిగృహంలో ఇంటర్, ఐటీఐ, డిగ్రీ కళాశాలలో చదువుతున్న బాలురు ఉంటున్నారు. కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు.

కొత్త భవనం మంజూరుకు ప్రతిపాదనలు

బాలుర వసతిగృహం నిర్మాణం కోసం ఐటీడీఏ అధికారులు సుమారు రూ.2.75 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనికి సంబంధించి ఆమోదం కూడా లభించింది. అలాగే జీఓతో పాటు అవసరమైన అన్ని ప్రక్రియలు కూడా పూర్తయ్యాయి. అయితే అనుమతుల కోసం చూస్తున్నామని అధికారులు చెబుతున్నా ప్రసుతం అవి ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం కావడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్, జులైలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకూ ఆ భవనంకు కనీస మరమ్మతులు కూడా చేపట్టిన దాఖలాలు లేవు. మళ్లీ వర్షాలు ప్రారంభమైతే సిమెంట్ పెచ్చులు, శ్లాబ్‌కు ఊసలు ఊడి బయటకు వచ్చిన భవనంలో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు ఉండవలసిందే. అలాగే గుమ్మాలు, కిటికీలు కూడా పూర్తిగా పాడైపోయాయి. మరుగుదొడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు పాత భవనం తొలగించి నూతన భవనం నిర్మాణానికి కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



బుట్టాయగూడెం గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలమై ఉంది. శిథిలమైన భవనంలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. కనీసం తలుపులు, కిటికీలు కూడా లేవు. అధికారులు స్పందించి కొత్త భవనం నిర్మాణానికి కృషి చేయాలి. లేకుంటే భవన నిర్మాణం ప్రారంభించే వరకూ ఆందోళన చేస్తాం.

– బన్నే వినోద్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు, బుట్టాయగూడెం

సారా కేసుల నమోదు

కొయ్యలగూడెం: సారా క్రయవిక్రయాలకు సంబంధించి నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం మంగళవారం తెలిపారు. రాజవరం గ్రామంలో ఐదు లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, పోలవరం మండలంలో ఇద్దరు వ్యక్తులకు కోర్టు రిమాండ్ విధించిందని వివరించారు.

ఫేస్‌బుక్ పోస్టులపై కేసు

జంగారెడ్డిగూడెం: ఫేస్‌బుక్‌లో అసభ్యకర పోస్టులు పెడుతూ తనను మానసికంగా వేధిస్తున్నారని జంగారెడ్డిగూడెం డివిజన్‌లో ఓ ప్రైవేట్ ఛానల్ రిపోర్టర్ మైరెడ్డి పవన్‌చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఫిబ్రవరి 24 నుంచి ఓ వ్యక్తి ఫేస్‌బుక్ అకౌంట్‌తో పవన్ చంద్రశేఖర్‌పై అసత్య పోస్టులు పెడుతున్నాడని, వీటిని తొలగించాలంటే రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని పేర్కొన్నారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెంలో చోరీపై కేసు నమోదు చేశామని ఎస్సై జబీర్ తెలిపారు. మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనికి మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లిన బి.ఝాన్సీరాణి మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చే సరికి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న సుమారు 5 కాసుల బంగారు వస్తువులు చోరీకి గురైందని తెలిపారు. చోరీ సొత్తు విలువ రూ.75 వేలు ఉంటుందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

నేడు ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

జంగారెడ్డిగూడెం: ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహన, కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం స్థానిక ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణలో ఏలూరు జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినట్టు బాపూజీ సీనియర్ సిటిజన్స్ సభ్యులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డు కోసం సెల్ నెంబర్ 99890 14238కు సంప్రదించాలని పేర్కొన్నారు.

గిన్నిస్ రికార్డ్స్‌లో స్థానం

కుక్కునూరు: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కోసం మండలంలోని పెద్దరావిగూడెం పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన శెట్టి మోక్షిత్ రిషి నిహార్ (12) ప్రయత్నించి ప్రశంసలు అందుకుంటున్నాడు. గతేడాది డిసెంబర్ 31న హైదరాబాద్‌లో 1046 మంది విద్యార్థులతో ఒక గంట సమయంలో కీబోర్డు వాయించే వీడియో తీసి ఇన్‌స్టాలో అప్‌లోడ్ చేశారు. కీబోర్డు ప్లే చేసిన కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను అందించారు. వీరిలో నిహార్ ఉన్నాడు.

పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

బుట్టాయగూడెం: గాలి, వడగండ్ల వానలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా వ్యాప్తంగా కురిసిన వడగంట్ల వాన, గాలి వానతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న, అరటి, జీడిమామిడి, పొగాకు, మిర్చి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. మిగిలిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పంటల బీమా పథకం అమలు చేయాలన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు యు.ఏసుబాబు, వడ్లమూడి వెంకటేశ్వరరావు, కొమరం నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో శ్రీరామ కట్టు చెరువు

ప్రక్షాళనకు రైతుల డిమాండ్

కొయ్యలగూడెం: స్థానిక కన్నాయిగూడెం రోడ్డులో ఉన్న శ్రీరామ కట్టు చెరువు ఆక్రమణలకు గురవుతోంది. చెరువు పీడబ్ల్యూడీ పరిధిలోని 26 ఎకరాల్లో ఉండే ఈ చెరువు దాదాపు ఎనిమిది ఎకరాలు ఆక్రమణకు గురైంది. దీంతో దాదాపు 200 ఎకరాలకు పైగా ఆయకట్టు రైతులు, మత్స్యకారులు సాగునీరందక నష్టాలు ఎదుర్కొంటున్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా సరఫరా అయ్యే గోదావరి నీటిని చెరువులోకి మళ్లించడం వల్ల రెండో పంటకు కూడా సాగునీరు అందేది. ఆక్రమణలతో ఇప్పుడా పరిస్థితి లేదు. చెరువులో నీటి సామర్థ్యం పూర్తిస్థాయిలో ఉంటే కొయ్యలగూడెం, దేవరపల్లి మండలాల రైతులకు సైతం ప్రయోజనం చేకూరుతుంది. దిగువన ఉన్న మరో రెండు చెరువులకు సాగునీరు, పశువులకు తాగునీరు అందేది. ఇప్పటికే చెరువు భూమిని ఆక్రమించి ఆయిల్‌పామ్ మొక్కలు పెంచుతున్నారని, ఇలా ఒకరిని చూసి ఒకరు చెరువు గర్భాన్ని ఆక్రమించుకుంటూ పోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువును ఆనుకుని ఉన్న రైతులే చెరువు గర్భాన్ని ఆక్రమించి రాత్రి వేళల్లో మట్టితోలకాలు చేసి చదును చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆక్రమణలకు కూటమి నేతలు కొమ్ముకాస్తుండడంతో అధికారులు సైతం మిన్నకుండి పోతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని వారు కోరుతున్నారు.



చెరువు గర్భంలో చదును చేస్తున్న దృశ్యం



చెరువు గర్భంలో పాతిన ఆయిల్‌పామ్ మొక్కలు

ఏజెన్సీలో భూ సమస్యలపై ధర్నా

పోలవరం రూరల్: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో పోలవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పశ్చిమ ఏజెన్సీలో భూ వివాదాలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. గిరిజనేతరుల భూ రికార్డులు, టైటిల్ వెరిఫికేషన్ చేయకుండా గిరిజనుల రికార్డులు తీసుకురమ్మని తహసీల్దార్ చెప్పడం సరికాదన్నారు. 1/70, ఎల్‌టీఆర్ గిరిజన చట్టాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. గిరిజనులు సాగు చేస్తున్న భూముల్లో 1బి, అడగంల్‌లో నమోదు చేసి హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కు చట్టం 2006 ప్రకారం పోడు భూములు సాగు చేస్తున్న వారందరికీ హక్కు పట్టాలు ఇవ్వాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ మండలంలో పాడైపోయిన రహదారులను పునర్నిర్మించాలన్నారు. కొమ్ముగూడెం, వింజరం, కోయనాగంపాలెం గ్రామాలకు శ్మశాన వాటిక స్థలం లేదని, స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు తామ బాలరాజు, బొరగం భూచంద్రరావు, మడివి చలపతిరావు, కొమరం పోసిరత్నం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

అధ్యాపకులకు అభినందనలు

జంగారెడ్డిగూడెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభ అవార్డు గ్రహీత స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు జె.రాజా శ్రీకాంత్‌ని మంగళవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ రాజా శ్రీకాంత్‌కు అవార్డు రావడం కళాశాలకు, మనకు గర్వకారణమన్నారు. రాజాశ్రీకాంత్ మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందని, సహకరించిన కుటుంబ సభ్యులు, ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది ఈ సందర్భంగా రాజా శ్రీకాంత్‌కు అభినందనలు తెలిపారు.



అధ్యాపకులు రాజా శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు

హనుమాన్‌కు అభినందన

జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గణిత శాస్త్ర సీనియర్ అధ్యాపకుడు గురుజు భక్త హనుమాన్‌ను మంగళవారం స్థానిక ఎస్‌డీఎస్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు పూలమాలతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాట్లాడుతూ రెండోసారి తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మరింత సమర్థవంతంగా పనిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌డీఎస్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



హనుమాన్‌ను అభినందిస్తున్న దృశ్యం

మంచినీటి బోరుకు శంకుస్థాపన

కామవరపుకోట: స్థానిక పంచాయతీ పరిధిలో పాతూరు గుడ్ల గురవమ్మవారి ఆలయ సమీపంలో మంచినీటి కొత్తబోరు ఏర్పాటుకు మంగళవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ప్రస్తుత పంచాయతీ బోరుకు సమీపంలో పంచాయతీ నిధులు రూ.2.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు మొత్తం రూ.6.10 లక్షలతో కొత్త బోరు వేశారు. పాతూరు, కామవరపుకోట టౌన్ ప్రాంతాలకు తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూష భాగ్యరాజ్, జెడ్పీటీసీ కడిమి రమేష్, వార్డు మెంబర్లు ఘంటా భాస్కరరావు, యర్రా ఆదినారాయణ, కంచర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షుడు సాయిన కనకరాజు, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆరుమళ్ల ధర్మ తదితరులు పాల్గొన్నారు.



బోరుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అనూష, జెడ్పీటీసీ రమేష్

ధాన్యం కొనుగోలుపై అవగాహన

కొయ్యలగూడెం: మండలంలోని గవరవరం గ్రామంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఏఓ చెన్నకేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జంగారెడ్డిగూడెం ఆర్డీఓ రమణ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి, కొన్న 48 గంటల్లో డబ్బులు రైతులకు జమ చేస్తున్నట్టు చెప్పారు. ముందుగానే గోనెసంచులు రైతు సేవ కేంద్రంలో ఉంచామన్నారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.చెల్లన్నదొర, వ్యవసాయ అసిస్టెంట్ అబ్రహం లింకన్, వీఆర్వోలు మధు, ముత్యాలరావు, రైతులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేసుకోవాలి

కామవరపుకోట: ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి అమ్మాలంటే ఖచ్చితంగా ఈ పంటలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలో రావికంపాడు, కామవరపుకోట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. పవన్ కుమార్ మాట్లాడుతూ కనీస మద్దతు ధర క్వింటాల్‌కు కామన్ రకానికి రూ.2300, గ్రేడ్ ఎ రకానికి రూ.2320 ప్రభుత్వం ఇస్తుందన్నారు. తహసీల్దార్ ఎలిసా మాట్లాడుతూ గోనె సంచుల అందుబాటులో ఉన్నాయని, రవాణాకు ఇబ్బంది లేదని అన్నారు. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



గవరవరంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణ

కొయ్యలగూడెం వాసికి పురస్కారం

కొయ్యలగూడెం: నాటక రంగంలో అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా కందుకూరి పురస్కారానికి కొయ్యలగూడెంకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మహాశివ బట్టు వెంకట రాజర్షి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ముగ్గురికి, జిల్లా స్థాయిలో 107 మందికి మొత్తంగా 110 మంది నాటకరంగ కళాకారులను కందుకూరి పురస్కారాలకు ఎంపిక చేశారని తెలిపారు. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి నాటక రంగ దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పురస్కారాలను ప్రదానం చేస్తారని వివరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

చింతలపూడి : చింతలపూడిలో మంగళవారం ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలను అరికట్టడంపై సిబ్బంది అగ్నిమాపకాధికారి కె.వెంకట్‌రెడ్డి నేతృత్వంలో విన్యాసాలను చేసి చూపించారు.

సమ సమాజ స్థాపనే లక్ష్యం

టి నరసాపురం: సమ సమాజ స్థాపన కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. టి.నరసాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) మండల సమావేశం వీరంకి వెంకట్రావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

కొయ్యలగూడెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఐక్యతతోనే హక్కుల సాధన సులభతరమవుతుందని పాస్టర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం పేర్కొంది. మంగళవారం స్థానిక కృపా సన్నిధి ఆవరణలో ఫోరం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్, ప్రముఖ విద్యావేత్త అలుగు ఆనంద శేఖర్, హోప్ మినిస్ట్రీస్ అధినేత గెడ్డం జాషువా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ మేధావి అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని హక్కులు పొందటానికి ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, క్రైస్తవులని విడివిడిగా ఉండకుండా చూడాలని కోరారు. మతోన్మాద శక్తులను ఎదుర్కోవడంలో లౌకికవాదులను కలుపుకొని పోరాడాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.



కొయ్యలగూడెంలో పాల్గొన్న ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు

18న ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం ఈనెల 18న స్థానిక రోటరీ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్టు ప్రెసిడెంట్ వెలివెల పెద్దిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల ఉద్యోగులు పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం: స్థానిక మమత ఆసుపత్రి ఆధ్వర్యంలో ముగ్గురు దివ్యాంగులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్టు ఆస్పత్రి సీఈఓ చిన్ని తెలిపారు. స్థానిక ఎస్సీపేట సీఎస్ఐ స్కూల్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం మార్లపూడి శ్రీను, మార్లపూడి పెద్దలు చిన్న కుమారుడికి, ప్రత్తిపాటి ప్రసాద్‌కు ఈ సాయం అందించామని చెప్పారు.

పేరంపేటలో పొగాకు బ్యారన్ దగ్ధం

జంగారెడ్డిగూడెం: పేరంపేటలో రైతు ఇర్లా శ్రీనివాసరావు చెందిన పొగాకు బ్యారన్ మంగళవారం తెల్లవారుజామున దగ్ధమైంది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు బేరన్‌ను, పొగాకును పరిశీలించి రైతు శ్రీనివాసరావును పరామర్శించారు. బ్యారన్, పొగాకు రైతులు బేరన్ ఉడికించే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతు శ్రీనవాసరావుకు తగిన న్యాయం చేయాలని అధికారులను కోరారు. శ్రీనివాసరావును పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు, జంగా కమలాకర్‌రెడ్డి, కఠారి నారాయణ, కఠారి సీతారాంబాబు, కఠారి చక్రవర్తి పాల్గొన్నారు.



పొగాకు బ్యారన్ దగ్ధమై నష్టపోయిన రైతును పరామర్శిస్తున్న జెట్టి గురునాథరావు

కమిషనర్‌గా రాంబాబు

చింతలపూడి: స్థానిక నగర పంచాయతీ కమిషనర్‌గా ఎ.రాంబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జగ్గయ్యపేట మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. ఇక్కడి కమిషనర్ డి.పావని అనంతపురం మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

మే 10న జాతీయ లోక్‌అదాలత్

జంగారెడ్డిగూడెం: స్థానిక కోర్టులో మే 10వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సీహెచ్ కిషోర్ కుమార్ తెలిపారు. రాజీ పడదగ్గ కేసులను పరిష్కరించుకోవచ్చని, దీనిపై కక్షిదారులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొనేలా న్యాయవాదులు, పోలీసు అధికారులు అవగాహన కల్పించాలని కిషోర్ కుమార్ కోరారు.